క్లుప్తంగా

లోయపల్లిలో 'ఉపాధి' కూలీల నిరసన



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచాల: ఉపాధి కూలీలకు పే స్లీప్‌లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు బొట్టు జానీ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని లోయపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి శోభకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు గతంలో మాదిరిగా వేసవి అలవెన్స్ కల్పించాలన్నారు. పనిముట్లు ఇవ్వాలన్నారు. పని చేసే చోట తాగు నీరు, మెడికల్ కిట్లు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సిలివేరు రాజు, సంఘం నాయకులు వెంకటయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

తలకొండపల్లి: ఆయిల్ పామ్ సాగుపై మండల రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తామని హార్టికల్చర్ డివిజన్ ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ రుక్మిణి సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఆసక్తి గల రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ఆమె కోరారు.

పట్టు పురుగుల పెంపకంపై..

మండల పరిధిలోని బల్సులపల్లి తండాలో మంగళవారం పట్టు పురుగుల పెంపకంపై తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించబడుతుందని జిల్లా పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు ముత్యాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారిణి నీరజగాంధీ, జాయింట్ డైరెక్టర్ లత, ఉప సంచాలకులు లక్ష్మయ్య, సైంటిస్టు డాక్టర్ మాధురిలు హాజరవుతున్నారని ఆయన చెప్పారు. ఉదయం 10 గంటలకు కాలు నాయక్ షెడ్ వద్ద నిర్వహిస్తారని తెలిపారు.

రైతు కుటుంబానికి సహకార సంఘం అండ



మృతుడి కుమారుడికి నగదు అందజేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడైన తారామతిపేటకు చెందిన మహ్మద్ రహీముద్దీన్ గత నెల 28వ తేదీన మృతి చెందారు. సంఘం తరపున బాధిత కుటుంబానికి అందించే రూ.25 వేల నగదును సోమవారం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ మృతుడి కుమారుడు మహ్మద్ నయీమ్‌కు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మేకల రాములు, కందాడి మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వద్దేపల్లి పాపయ్యగౌడ్, మాజీ వైస్‌చైర్మన్ సతీశ్‌గౌడ్, మేనేజర్ ఐలేష్‌యాదవ్, నాయకులు ఎర్రయ్య, రాములు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కడ్తాల్: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పలు వాహనాలను తనిఖీ చేశారు. సీఐ బద్యానాథ్ చౌహన్ ఆధ్వర్యంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ఆర్టీసీ బస్సులలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ బద్యానాథ్ చౌహాన్ మాట్లాడుతూ.. సారా రహిత తెలంగాణే లక్ష్యంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. బస్సులలో ఎవరైన అనుమానాస్పదంగా ఎలాంటి బ్యాగులతో వచ్చిన వాటిని తనిఖీ చేసి, బస్సులలో ఎక్కించుకోవాలని డ్రైవర్లకు, కండక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్గో సిబ్బంది, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంత.. సమస్యలే చెంత!

ఆదాయం మెండుగా ఉన్నా వసతులు శూన్యం

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రయవిక్రయదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఇరుకు వీధిలో నిర్వహిస్తున్న కడ్తాల్ సంత

తైబజార్ వేలంపాట వివరాలు

సంవత్సరం	రూ.లక్షల్లో
2016–17	3.80
2017–18	5
2018–19	6.21
2019–20	7.57
2020–21	4.87
2021–22	7.37
2022–23	8.18
2023–24	9.10

కడ్తాల్: వారాంతపు సంత సమస్యల చింతగా మారింది. ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీ అధికారులు తైబజారు ద్వారా వచ్చే ఆదాయంపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు. కానీ సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం శ్రద్ధ కనబరచడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు సమీపంలోని 30 నుంచి 40 వరకు తండాలు, గ్రామాలు ఉండటంతో అక్కడ పండించిన కూరగాయలు, పంటల ఉత్పత్తులను తీసుకువచ్చి ప్రతీ గురువారం కడ్తాల్ వారాంతపు మార్కెట్‌లో విక్రయించుకొని జీవనోపాధి పొందుతున్నారు. ఈ సంత ఎన్నో ఏళ్లుగా గ్రామంలో ప్రధాన వీధిగా ఉన్న గాంధీనగర్‌లో సాగుతుంది. ఇక్కడ రహదారికి ఇరుపక్కల దుకాణ సముదాయల ముందే చిరు వ్యాపారులు కూరగాయలు, పండ్లు, వివిధ రకాల వస్తువులు విక్రయిస్తుంటారు. దీంతో ఆయా దుకాణ యాజమానులతో చిరు వ్యాపారులకు తరచూ తగాదాలు అవుతున్నాయి. అదే విధంగా గాంధీనగర్ రహదారి ఇరుకుగా ఉండటంతో మక్తమాధారం, పెద్దారెడ్డి చెరువు, కొంగ్రిగానిబోడ్, పిల్లిగుండు తండాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షకాలంలో వరదనీరు వెళ్లే మార్గం లేక రహదారులన్నీ బురదమయమవుతున్నాయి.

రూ.లక్షల్లో ఆదాయం

గ్రామ పంచాయతీకి సంత ద్వారా ఏటా వచ్చే ఆదాయం పెరుగుతూనే ఉంది. ఐదారు ఏళ్లుగా గ్రామ పంచాయతీకి తైబజార్ ఆదాయం పరిశీలిస్తే వేలం పాట ద్వారా భారీగా పెరిగింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి తైబజార్ వేలం పాట ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడింది. ఆదాయం పెరిగినా వసతులను కల్పించడంలో మాత్రం గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రధానంగా సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం లేదు. సంత జరిగే ప్రదేశంలో మల, మూత్ర శాలలు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆదాయం మెండుగా ఉన్న వసతుల కల్పనలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటికి తీవ్ర ఇబ్బంది



సంతకు వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు సంతలో తాగునీరు దొరక్క తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూత్రశాలలు, వాహనాల పార్కింగ్ లేక పోవడంతో క్రయ విక్రయదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది సమస్యలపై దృష్టి సారించాలి.

– మహ్మద్ లాయక్‌అలీ, స్థానిక నాయకుడు, కడ్తాల్

సమస్యలు పరిష్కరించండి



సంతలో వివిధ రకాల కూరగాయాలను విక్రయించే వారి నుంచి తైబజారు రుసుం కచ్చితంగా వసూలు చేస్తున్నారు. కానీ సౌకర్యాల కల్పనలో మాత్రం దృష్టి పెట్టకపోవడం విడ్డూరంగా ఉంది. వర్షం కురిసినప్పుడు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.

– రాజేందర్‌యాదవ్, స్థానికుడు, కడ్తాల్

ఉన్నతాధికారుల దృష్టికి..



సంత జరిగే ప్రదేశంలో నీటి వసతి కల్పించేందుకు కృషి చేస్తున్నాం. మూత్రశాలలు నిర్మించేందుకు రెండు చోట్ల స్థలాలను పరిశీలించాం. స్థానికులు అభ్యంతరం తెల్పడంతో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదిస్తా.

– రాఘవేందర్, పంచాయతీ కార్యదర్శి, కడ్తాల్

విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి

ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పలు కాలనీలలో విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా కాలనీలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను సరిచేయాలని, దిమ్మె ఎత్తును పెంచాలని సూచించారు. లోవోల్టేజీ సమస్య ఉంటే అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ నరేందర్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

జీపీకి వాహనం బహూకరణ



వైకుంఠ రథాన్ని గ్రామ పంచాయతీకి అందజేస్తున్న నర్సింహ

తలకొండపల్లి: గ్రామ పంచాయతీకి ఉచితంగా వైకుంఠ రథాన్ని బహూకరించడం గొప్ప విషయమని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నర్సింహ తన తండ్రి పద్మ వెంకటయ్య జ్ఞాపకార్థం ఉచితంగా వైకుంఠరథాన్ని సోమవారం తలకొండపల్లి గ్రామ పంచాయతీకి అందించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నర్సింహను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ కని పెంచిన గ్రామానికి సహాయ పడాలన్నారు. ఈ సందర్భంగా నర్సింహ దంపతులను శాలువాలతో సన్మానించారు. నర్సింహ మాట్లాడుతూ.. తాను పుట్టిన ఊరికి సహాయం చేయాలనే ఉద్దేశంతో వైకుంఠ రథాన్ని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, మాజీ ఉప సర్పంచ్ అనిల్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, శేఖర్, యాదయ్య, విఠల్, పాండు, జంగయ్య, రాములు, నర్సింహ, కుమార్, గణేష్ పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించండి

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి మహేశ్వరం డిపో నుంచి బస్ సర్వీసును పునరుద్ధరించాలని గ్రామ మాజీ సర్పంచ్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ భగ్వాన్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. బస్ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చౌదర్‌పల్లి గ్రామానికి ఐదేళ్లుగా మహేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్ నడుస్తుంది. అనివార్య కారణాలతో ఇటీవల బస్‌ను నిలిపివేశారు. దీంతో బస్ లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు స్థానిక నాయకులు సోమవారం మహేశ్వరం డిపో అసిస్టెంట్ మేనేజర్ అంజమ్మకు వినతి పత్రం అందజేశారు. బస్‌ను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీసీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బాలమైసయ్య, చంద్రయ్య, భగ్వాన్‌రెడ్డి, శ్రీను, కృష్ణయ్య, శ్యాంసుందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయంలో అభివృద్ధి శూన్యం

బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌సింగ్

ఆమనగల్లు: మున్సిపాలిటీ అభివృద్ధిని బీఆర్‌ఎస్ నాయకులు ఏనాడూ పట్టించుకోలేదని బీజేపీ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఆమనగల్లును రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయాలంటూ బీఆర్‌ఎస్ నేతలు ప్రకటనలు ఇస్తున్నారని ఆయన విమర్శించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్‌సింగ్ మాట్లాడుతూ.. జిల్లాల పునర్విభజనలో ఆమనగల్లుతో పాటు మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను రంగారెడ్డి జిల్లాలో కలిపినప్పటికీ అందుకు తగిన విధంగా ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఆర్డీఓ, సబ్ ట్రెజరీ, ఏసీపీ కార్యాలయాలు తీసుకువస్తామని అప్పట్లో చెప్పిన బీఆర్‌ఎస్ నేతలు ఒకటి కూడా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. కేవలం రాజకీయంగా లబ్ధి పొందేందుకు బీఆర్‌ఎస్ నాయకులు రెవెన్యూ డివిజన్ కార్యాలయం సాధనకు ఉద్యమిస్తామంటూ ప్రకటనలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు నరేందర్‌నాయక్, కరుణ, మహేశ్, శ్రీను, శ్రీధర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యా బోధనతో ఆదర్శంగా ఉండాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల అభివృద్ధి, సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులను సక్రమంగా ఖర్చు చేయాలన్నారు. నిధుల కొరత ఉన్న పాఠశాలలకు మండల పరిషత్ నుంచి మంజూరు చేస్తానన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, రోడ్లు భవనాల శాఖ ఏఈ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు ముఖ్యం



కడ్తాల్: అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆమనగల్లు: వానాకాలం పంటల సాగుకోసం రైతులు విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండలం వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. మండలంలోని కోనాపూర్, సీతారాంనగర్‌తండా, చంద్రాయణపల్లితండా, ముర్తుజపల్లి, మాలెపల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కోనాపూర్‌లో అరుణకుమారి మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో పంటలు సాగు చేయాలని సూచించారు. విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పంటమార్పిడి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాణి, సాయిరాం, శివతేజ, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి

కడ్తాల్: ఖరీఫ్‌కు సంబంధించి రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత అన్నారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిగూడ, మక్తమాధారం, ముద్వీన్, పెద్దావేములోని బావి తండాలలో విత్తనాల కొనుగోలుకు సంబంధించి రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. లూజుగా ఉన్న సంచులలో విత్తనాలు కొనుగోలు చేయరాదని, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు దుకాణం నుంచి తప్పని సరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్, రసీదు బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని అన్నారు. వ్యవసాయశాఖ ద్వార గుర్తింపు అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు చంద్రమౌళి, ప్రభాకర్, చెన్నయ్య, కార్యదర్శి రాజు, వ్యవసాయ విస్తరణ అధికారి రమణ, రైతులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ

ఆమనగల్లు: మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ షాపులను సోమవా రం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులలో ఉన్న ఎరువులు, ఫర్టిలైజర్, విత్తనాల నిలువలను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు ఇచ్చారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు విధిగా రసీదులను ఇవ్వాలని అరుణకుమారి సూచించారు.

స్నేహితుడి కుటుంబానికి తోడ్పాటు



రాజేష్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

యాచారం: కష్టాల్లో ఉన్న చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో ముత్యాల రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి ఆసరాగా 1998–99 గునుగల్ ఉన్నత పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థులు కదిలారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.80 వేల నగదు అందజేశారు. రాజేష్‌కు భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. శంకర్, రాజేందర్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కడ్తాల్: మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ గోజీ అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5 వేలు అందజేశారు. ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, మాజీ సర్పంచ్‌లు సాయిలు, హరిచంద్‌నాయక్ ఉన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో మల్లీశ్వరి జంగయ్య దంపతులు



ఉత్సవానికి హాజరైన భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని దండుమైలారం గ్రామ సమీపంలో గుట్టపై వెలిసిన శ్రీ పార్వతి రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సోమవారం నిర్వహించారు. ఆలయకమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ రావణమోని మల్లీశ్వరి జంగయ్య దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. బుధవారం వరకు ఈ కల్యాణోత్సవాలు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ జంగయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.